క్లుప్తంగా

మధ్యాహ్న భోజనం సక్రమంగా అందించాలి



తాళ్లపూడి జెడ్పీ హైస్కూల్లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ, ఎంపీడీవో

తాళ్లపూడి: విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని సక్రమంగా అందించాలని ఎంపీపీ జొన్నకూటి పోశిరాజు సూచించారు. తాళ్లపూడి జెడ్పీ ఉన్నత పాఠశాల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును శనివారం ఎంపీపీ పోశిరాజు, ఎంపీడీవో టి.వెంకటరమణ పరిశీలించారు. ఈ సందర్భంగా వారిద్దరూ వంట నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. కోడిగుడ్ల నాణ్యతను, పాఠశాల రికార్డులను పరిశీలించారు. భోజనం ఎలా ఉంది? రోజూ మెనూ ప్రకారం అందిస్తున్నారా? లేదా? అని విద్యార్థులను వారు ఆరా తీశారు. ఎంపీపీ, ఎంపీడీవోలు భోజనాన్ని రుచి చూశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సుబ్బలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి ఆశా అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

కాపు జేఏసీ మండల కన్వీనర్‌గా సత్యకిరణ్



ఉన్నమట్ల సత్యకిరణ్

నల్లజర్ల: ఏపీ కాపు, బలిజ ఉప కులాల జేఏసీ మండల కన్వీనర్‌గా నల్లజర్లకు చెందిన ఉన్నమట్ల సత్యకిరణ్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర జేఏసీ చైర్మన్ అమ్మ శ్రీనివాస నాయుడు, కన్వీనర్ శెట్టిపల్లి శివనాగరాజు నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సత్యకిరణ్ మాట్లాడుతూ త్వరలో మండలంలోని అన్ని గ్రామ కమిటీలను ఏర్పాటు చేస్తానన్నారు. జాతి విద్య,విజ్ఞానిక అభివృద్ధికి పాటుపడతానన్నారు. ఈ సందర్భంగా సత్యకిరణ్‌ను పలువురు అభినందించారు.

పంట నష్టం అంచనాలు సిద్ధం చేయాలి

నిడదవోలు రూరల్: ఎర్ర కాలువ, గోదావరి వరదల వల్ల దెబ్బతిన్న పంట నష్టం అంచనాలను త్వరితగతిన రూపొందించాలని మండల వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ సూచించారు. నిడదవోలులోని తహసీల్దార్ కార్యాలయం వద్ద పంట నష్టంపై శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 22 గ్రామ సచివాలయాల పరిధిలో నష్టపోయిన పంటలను క్షేత్రస్థాయిలో రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారుల బృందం పరిశీలిస్తోందన్నారు. వీటిపై గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద అభ్యంతరాలు స్వీకరిస్తామని, రైతులకు ఏమైనా అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని కోరారు. వీఆర్వోలు, అగ్రికల్చరల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

సబ్ ట్రెజరరీ అధికారికి సత్కారం



సబ్ ట్రెజరీ అధికారి ఫణీంద్రను సత్కరిస్తున్న పింఛనర్లు

నిడదవోలు: ప్రభుత్వ పెన్షనర్ల సంఘ నిడదవోలు మండల శాఖ సర్వసభ్య సమావేశాన్ని శనివారం స్థానిక పెన్షనర్ల కార్యాలయంలో నిర్వహించారు. ఇటీవల విడుదలైన ప్రభుత్వ ఉత్తర్వులు, వాటి వల్ల పెన్షనర్లకు కలిగే ప్రయోజనాల గురించి సంఘ ప్రధాన కార్యదర్శి కీర్తి ఆంజనేయులు సభ్యులకు వివరించారు. అనంతరం నిడదవోలు సబ్ ట్రెజరరీ అధికారి ఫణీంద్రను సత్కరించారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు బలగం అప్పారావు, జి. రాంబాబు.ఎస్.రాజేష్, కె.భవాని, ఏ.సౌందర్య, కె. రంగాచార్యులు, సామ్రాజ్యం, కొప్పుల వెంకటేశ్వరరావు, నరసింహమూర్తి, మురళి, గణేష్, ఎండీ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

నాలుగు గ్యాస్ సిలిండర్ల స్వాధీనం



అక్రమంగా వాడుతున్న గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్న సివిల్ సప్లయ్ అధికారులు

దేవరపల్లి: స్థానికంగా వ్యాపార సంస్థల్లో వినియోగిస్తున్న గ్యాస్ సిలిండర్లను సివిల్ సప్లయ్ అధికారులు శనివారం తనిఖీ చేశారు. స్థానిక చౌదరి భోజనం హోటల్‌లో రెండు, టీ హౌస్‌లో రెండు గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకుని, 6 ఎ కేసు నమోదు చేసినట్టు సీఎస్ డీటీ సత్యనారాయణ తెలిపారు. ఈ దాడుల్లో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ డి. వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ రోడ్డు సొగసు చూడతరమా

- 25 ఏళ్లుగా పరిష్కారం కాని రోడ్డు సమస్య
- టీడీపీ ప్రభుత్వంలో హడావుడిగా శంకుస్థాపన
- పనులు జరగని వైనం
- మూడు గ్రామాల ప్రయాణికులకు అవస్థలు



అధ్వానంగా ఉన్న లక్ష్మీపురం రోడ్డు



2019లో అప్పటి ఎంపీ మాగంటి మురళీమోహన్ ఆవిష్కరించిన శంకుస్థాపన శిలాఫలకం

దేవరపల్లి: జీఎన్‌టీ రోడ్డు నుంచి లక్ష్మీపురం వెళ్లే రోడ్డు మూడు దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోలేదు. రోడ్డు నిర్మాణం శిలాఫలానికే పరిమితమైంది. దాదాపు 25 ఏళ్ల క్రితం అప్పటి గోపాలపురం ఎమ్మెల్యే జొన్నకూటి బాబాజీరావు సారథ్యంలో జవహర్ రోజ్‌గార్ నిధులతో తారు రోడ్డు నిర్మించారు. అనంతరం ప్రభుత్వం దేవరపల్లి, లక్ష్మీపురం, పల్లంట్ల మీదుగా నిడదవోలుకు బస్సు సౌకర్యం కల్పించింది. విద్యార్థులకు సౌకర్యంగా ఉండేది. కొంత కాలానికి ఈ రోడ్డు శిథిలావస్థకు చేరింది. రోడ్డుకు ఇరువైపులా నల్లరాతి క్వారీలు, క్రషర్లు ఉండడంతో భారీ వాహనాల రాకపోకలతో రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. తారురోడ్డు కాస్తా మట్టి రోడ్డుగా మారింది. దాదాపు మీటరు లోతున గోతులు పడడంతో రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. దుద్దుకూరు, బందపురం, లక్ష్మీపురం గ్రామాల రైతులు, కూలీలు రోజూ ఈ రోడ్డుపై పొలాలకు వెళ్లి రావాలి. బైక్‌ల పొలాలకు వెళ్లే రైతులు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డు నిర్మాణం గురించి గత ప్రభుత్వంలో ధర్నాలు, ఆందోళనలు చేసినా ప్రయోజనం లేకపోయిందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా రోడ్డు నిర్మించి, బస్సు సౌకర్యాన్ని పునరుద్ధరించాలని మూడు గ్రామాల రైతులు, ప్రయాణికులు గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజును కోరుతున్నారు.

ఈ రోడ్డు నిర్మాణానికి గత టీడీపీ ప్రభుత్వంలో రూ.10 కోట్లు మంజూరు చేయగా, 2019, ఫిబ్రవరి 20న అప్పటి రాజమహేంద్రవరం ఎంపీ మాగంటి మురళీమోహన్, ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన చేసి ఐదేళ్లు దాటినా ఇప్పటి వరకూ రోడ్డుపై తట్టమట్టి వేయలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు నిర్మించి, బస్సు సౌకర్యం కల్పిస్తే ప్రయాణికులకు, విద్యార్థులకు మేలు జరుగుతుంది.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో రూ.12 కోట్లు మంజూరు

జీఎన్‌టీ రోడ్డు నుంచి నిడదవోలు అడ్డ రోడ్డు వరకూ రోడ్డు నిర్మాణానికి రూ.12 కోట్లతో అంచనాలు తయారు చేసి గతేడాది ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. జీఎన్‌టీ రోడ్డు నుంచి లక్ష్మీపురం వరకు క్వారీలు, క్రషర్లు ఉన్నందున సిమెంట్ రోడ్డు నిర్మించి, అక్కడి నుంచి తారురోడ్డు నిర్మించాలి. గతేడాది రోడ్డు నిర్మాణానికి టెండర్ల ప్రక్రియ నిలిచిపోవడంతో మర లా అంచనాలు పెంచి ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపారు. ఇంతలో ఎన్నికల నోటిఫికేషన్ వెలువడడంతో నిధులు మంజూరు కాలేదు.

మూడు దశాబ్దాలుగా మోక్షం లేదు



రోడ్డు ధ్వంసమై 30 ఏళ్ల అయింది. అప్పటి నుంచి ఎన్నో ప్రభుత్వాలు, ఎంతో మంది పాలకులు మారారు. అయినా రోడ్డుకు మోక్షం కలగలేదు. ఈ రోడ్డు ఉందనే విషయం చాలా మంది మర్చిపోయారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలి.

– దోసెల్లి ధనలక్ష్మి, సర్పంచ్, లక్ష్మీపురం

పాలకులు పరిశీలించాలి



లక్ష్మీపురం రోడ్డు దుస్థితిని పాలకులు పరిశీలించాలి. తారురోడ్డు కాస్తా పుంత దారిగా మారింది. రోడ్డు నిర్మాణం గురించి ఆందోళనలు చేసినా పట్టించుకున్న నాథుడు లేడు. ఈ రోడ్డుపై వెళ్లాలంటే ప్రజలు నరకయాతన పడుతున్నారు. బస్సు, ఆటో సౌకర్యం లేదు. వర్షం పడితే రోడ్డు పూర్తిగా బురద అవుతుంది. రోడ్డు నిర్మించాలని ఎంపీ డి.పురందేశ్వరికి వినతిపత్రం ఇచ్చాం.

– ఉప్పులపాటి రవికిరణ్ (కిట్టు), లక్ష్మీపురం

ఇటు గ్రామకంఠం సర్వే.. అటు పరస్పర ఆరోపణలు



వేగేశ్వరపురం మహాలక్ష్మమ్మ ఆలయం ఎదురుగా ఉన్న భూమిని సర్వే చేస్తున్న అధికారులు



సర్వే చేస్తున్న ప్రాంతానికి చేరుకున్న వేగేశ్వరపురం గ్రామస్తులు

తాళ్లపూడి: వేగేశ్వరపురం గ్రామదేవత మరిడి మహాలక్ష్మమ్మ ఆలయం ఎదురుగా ఉన్న స్థలాన్ని అధికారులు శనివారం సర్వే చేశారు. ఈ స్థలం ఎవరిదో తేల్చాలంటూ గ్రామానికి చెందిన టీడీపీకి చెందిన రెడ్డి అనే వ్యక్తి మీకోసంలో చేసిన ఫిర్యాదు మేరకు సర్వే జరిపామని సచివాలయ సర్వే అసిస్టెంట్ నామా ప్రియ తెలిపారు. కాగా 292/1 సి సర్వే నంబర్ గ్రామకంఠంగా ఉందన్నారు. ఈ స్థల సర్వే జరుగుతున్నపుడు వేగేశ్వరపురం సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావుతో పాటు మరికొందరు గ్రామస్తులు అక్కడకు చేరుకున్నారు. అదే సమయంలో గ్రామానికే చెందిన టీడీపీ నాయకుడు కైగాల శ్రీనివాస్ మరికొందరితో అక్కడకు వచ్చారు. దీంతో ఇరు వర్గాలూ పరస్పరం ఆరోపణలు చేసుకున్నాయి. ఈ సందర్భంగా సర్పంచ్ పరశురామారావు తదితరులు మాట్లాడుతూ మహాలక్ష్మమ్మ ఆలయంతో పాటు సమీపంలోని ఇతర ఆలయ భూములు కూడా గ్రామకంఠంలోనే ఉన్నాయన్నారు. అయితే టీడీపీ నాయకులు ఆలయాలపై వివాదాలు రేపుతున్నారని ఆరోపించారు. గ్రామంలోని పలు ఆలయాలపై వారు తరచూ మీకోసంలో ఫిర్యాదులు చేస్తూ, ఆలయ నిర్మాణాలను అడ్డుకోవడం సర్వసాధారణంగా మారిందన్నారు.

మృతుని కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా అందజేత

నిడదవోలు: పట్టణంలోని తీరుగూడెంకు చెందిన మత్స్యకారుడు ఘంటశాల వెంకటేష్ ఇటీవల ఎర్ర కాలువలో చేపల వేటకు వెళ్లి, వరద ఉధృతికి ప్రమాదవశాత్తూ నీటిలో మునిగి మృతి చెందాడు. ప్రభుత్వం నుంచి సాయంగా అతడి కుటుంబానికి మంజూరైన రూ.4 లక్షల చెక్‌ను శనివారం రాజమహేంద్రవరంలోని కలెక్టరేట్‌లో మృతుడి భార్య పాపాయమ్మకు రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్ అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ మృతిని కుటుంబానికి ఎక్స్‌గ్రేషియాగా ప్రభుత్వ బీమా పథకం ద్వారా రూ.5 లక్షలు, మత్స్యశాఖ ద్వారా మరో రూ.5 లక్షలు మంజూరయ్యాయన్నారు. ప్రస్తుతం తక్షణ సాయం కింద రూ.4 లక్షల చెక్కును కుటుంబ సభ్యులకు అందించామన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ పి.ప్రశాంతి, ఇన్‌చార్జి జేసీ జి.నరసింహులు, జిల్లా మత్స్యశాఖ అధికారి కేవీ కృష్ణారావు పాల్గొన్నారు.

దళితుడిపై దాడికి ఎమ్మార్పీఎస్ ఖండన

తాళ్లపూడి: దళితులపై అగ్రవర్ణాల దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామని ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి ఎర్రగడ్డ ఆకాష్ అన్నారు. మండలంలోని పోచవరం పంచాయతీ పరిధిలోని రాగోలపల్లిలో మాదిగ కులానికి చెందిన పోనుకుమాటి భాస్కరరావుపై అదే గ్రామానికి చెందిన రైతు ఉండవల్లి శ్రీను శుక్రవారం కత్తితో దాడి చేశారన్నారు. కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి చికిత్స పొందుతున్న భాస్కరరావును ఎమ్మార్పీఎస్ మండల నాయకులు శనివారం పరామర్శించారు. భాస్కరరావుపై దాడి చేసిన అగ్రవర్ణానికి చెందిన ఉండవల్లి శ్రీనును వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై తాళ్లపూడి పోలీస్ స్టేషన్‌లో ఎస్సీ అట్రాసిటీ కేసు నమోదైందన్నారు. బాధితుడ్ని పరామర్శించి వారిలో ఎమ్మార్పీఎస్ నాయకులు పూలపల్లి బాలకృష్ణ, మార్లపూడి అచ్చిబాబు, కోండ్రు రామయ్య, పోనుకుమాటి నాగు, పూలపల్లి చిరంజీవి, రాచర్ల విష్ణు, తమిర్బి మధు, కొండేపూడి రవి ఉన్నారు.

కౌలు రైతులందరికీ బ్యాంకు రుణాలు

- జిల్లాలో ఇప్పటికే 1,300 మందికి మంజూరు
- జిల్లా వ్యవసాయ అధికారి మాధవరావు



యూనియన్ బ్యాంకు అధికారులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి మాధవరావు

కొవ్వూరు: కౌలు హక్కుదారులందరికీ బ్యాంకర్ల ద్వారా రుణాలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు ప్రకటించారు. శనివారం ఆయన పట్టణంలో యూనియన్ బ్యాంకు మేనేజర్, ఫీల్డ్ ఆఫీసర్‌ను కలసి కౌలు రైతులకు రుణాల జారీపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకూ యూనియన్ బ్యాంక్ పరిధిలో 40 మంది కౌలు రైతులకు ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున రుణంగా అందించినట్లు ప్రకటించారు. జిల్లా వ్యాప్తంగా 1,09,600 మంది కౌలు రైతులకు కౌలు హక్కుదారు పత్రాలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించామన్నారు. ఇప్పటి వరకూ 94 వేల మంది కౌలు రైతులకు పత్రాలు అందజేశామన్నారు. వారిలో ఇంత వరకూ 1,300 మంది రైతులకు రూ.50 వేల చొప్పున బ్యాంకర్ల నుంచి రుణాలు ఇప్పించామన్నారు. జిల్లాలోని ఇతర బ్యాంకర్లు అందరినీ కలసి కౌలు రైతులకు రుణాల మంజూరులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని మాధవరావు ప్రకటించారు. వ్యవసాయ శాఖ కొవ్వూరు సహాయ సంచాలకుడు పి.చంద్రశేఖర్, ఏవో గంగాధర్‌లు ఆయన వెంట ఉన్నారు.

కాలువ ముంచుతోంది.. ఆదుకోండి

- ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే వెంకట్రాజుకు కొవ్వాడ కాలువ ముంపు బాధితుల మొర



వెంకటాయపాలెం వద్ద కొవ్వాడ కాలువను పరిశీలిస్తున్న ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే వెంకట్రాజు

దేవరపల్లి: ఏటా వర్షా కాలంలో కొవ్వాడ కాలువ ఉధృతంగా ప్రవహించడంతో వందలాది ఎకరాల్లోని పంటను కోల్పోతున్నామని దేవరపల్లి మండలం గౌరీపట్నం, గోపాలపురం మండలం వెంకటాయపాలెం గ్రామాల రైతులు ఎంపీ, ఎమ్మెల్యేలకు మొరపెట్టుకున్నారు. కొవ్వాడ కాలువ వరద ముంపుతో దెబ్బతిన్న పంటలను శనివారం రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు ఈ రెండు గ్రామాల్లో పరిశీలించారు. ముంపునకు తాత్కాలిక ఉపశమనం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు వారిని కోరారు. రెండు మండలాల్లో సుమారు 2,300 ఎకరాల్లోని పంట నీట మునిగినట్టు ఏడీఏ చంద్రశేఖర్ వివరించారు. కాలువ పూడికతీసి, గట్లు ఎత్తుపెంచాలని, మూడు ప్రదేశాల్లో వంతెనలు నిర్మించాలని టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు ఆండ్రు అనిల్ వివరించారు. ఎంపీ పురందేశ్వరి మాట్లాడుతూ ఎర్రకాలువ, కొవ్వాడ కాలువ వరద నీటి ముంపుకు శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు. అంచనాలు తయారు చేయించి ప్రతిపాదనలు ప్రభుత్వానికి అందజేయమని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజుకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం వద్ద నిధులు లేకపోతే కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు తీసుకువస్తానని పురందేశ్వరి తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్మల దత్తు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి డి.సువర్ణరాజు, పలువురు రైతులు, రైతు నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ కృతజ్ఞతలు

ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టులో తీర్పు వెలువడడంతో ఎమ్మార్పీఎస్ నాయకులు శనివారం గౌరీపట్నంలో రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజులను కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి తాతపూడి సురేష్ మాదిగ, మండల శాఖ అధ్యక్షుడు కోడి సూరి మాదిగ, కొలూరి సురేష్ మాదిగ తదితరులు కలసిన వారిలో ఉన్నారు.

మాదిగల భవిష్యత్ కార్యాచరణపై 5న సమావేశం

కొవ్వూరు: మాదిగల భవిష్యత్ కార్యాచరణ రూపొందించేందుకు ఈనెల ఐదో తేదీ సాయంత్రం నాలుగు గంటలకు స్థానిక పరిమి రామారాయుడు, రత్తమ్మ కల్యాణ మండపంలో సమావేశం నిర్వహిస్తున్నామని ఎమ్మార్పీఎస్ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడు ముప్పిడి విజయరావు మాదిగ కోరారు. సుప్రీం కోర్టు ఏడుగురు సభ్యుల ధర్మాసనం 30 ఏళ్ల మాదిగల కలను నిజం చేస్తూ ఆగస్టు 1న ఇచ్చిన తీర్పు హర్షణీయం అన్నారు. పార్టీలకు అతీతంగా మాదిగ నాయకులు, రాజకీయ ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీపీలు, వివిధ హోదాల్లో ఉన్న ప్రజాప్రతినిధులు ఈ సమావేశానికి హాజరు కావాలని కోరారు.

ఐదుగురు గ్రేడ్‌-5 కార్యదర్శుల బదిలీ

నిడదవోలు రూరల్: మండలంలోని ఐదుగురు గ్రేడ్‌-5 సచివాలయ కార్యదర్శులను గ్రామ పంచాయతీ డీడీఓలుగా నియమిస్తూ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పంచాయతీ అధికారులు బదిలీ చేశారు. కాటకోటేశ్వరం సచివాలయ కార్యదర్శి కె.రమ్యను పెరవలి మండలం అన్నవరప్పాడుకు, పురుషోత్తపల్లి కార్యదర్శి టి.మోహనకృష్ణను తణుకు మండలం యర్రాయిచెర్వుకు బదిలీ చేశారు. అలాగే శెట్టిపేట పంచాయతీ కార్యదర్శి మట్టా స్వప్నను పెరవలి మండలం కడింపాడుకు, పెండ్యాల కార్యదర్శి ఐ.శివగణ కుమార్‌ను తాడేపల్లిగూడెం మండలం దండగర్రకు , పందలపర్రు కార్యదర్శి గజ్జరపు ప్రసాద్‌ను వీరవాసరం మండలం మెరకపాలెం పంచాయతీకి బదిలీ చేశారు.

కేరళ బాధితులకు విరాళాల సేకరణ



పట్టణంలో విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

నిడదవోలు: కేరళలోని వయనాడ్‌లో కొండ చరియలు విరిగి పడిన దుర్ఘటనలో చనిపోయిన వారి కుటుంబాలను ఆదుకునేందుకు సీపీఎం విరాళాల సేకరణ చేపట్టింది. ఆ పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలో ప్రజల నుంచి శనివారం విరాళాల సేకరణ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు జువ్వల రాంబాబు మాట్లాడుతూ బాధితులను ఆదుకొనేందుకు వయనాడ్ రిలీఫ్ ఫండ్ పేరుతో, సీపీఎం రాష్ట్ర కమిటీ పేరుతో ఉన్న రెండు బ్యాంకు ఖాతాలకు విరాళాలు పంపించాలని దాతలకు విజ్ఞప్తి చేశారు. బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు దాతలు ఇతోధికంగా విరాళాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జి.డేనియల్, యర్రా శ్రీను, రసూల్, సత్యనారాయణ, ఈజీ సత్యనారాయణ, నరేష్, శ్రీరామ్, శ్రీనివాస్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఆఫీసులో గది కేటాయించండి

నిడదవోలు: తమకు నిడదవోలు మున్సిపల్ కార్యాలయలో ఒక గది కేటాయించాలని ఈ మున్సిపాలిటీ పరిధిలో విధులు నిర్వహిస్తున్న మెప్మాకు చెందిన ఆర్పీలు కోరారు. ఈ మేరకు వారు శనివారం మున్సిపల్ కమిషనర్ టి.రాంభూపాల్ రెడ్డిని కలసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆర్పీలు మాట్లాడుతూ మెప్మా సంస్థలో 20 మంది పని చేస్తున్నామన్నారు. రోజూ మున్సిపల్ ఆఫీసుకు వచ్చి హాజరు వేయడం, డ్వాక్రా మహిళల పనులు చేయడం, ప్రభుత్వం చెప్పిన సర్వేలు నిర్వహించడం తమ విధులన్నారు. ఇందుకోసం ప్రస్తుతం తాము మున్సిపల్ ఆఫీసు పైభాగంలో మెట్లపై కుర్చీ చేసుకుని విధులు నిర్వహిస్తున్నామన్నారు. అందుకే ఒక గదిని కేటాయించాలని కోరాదు. ఆర్పీలకు గదిని కేటాయించే అంశాన్ని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ రాంభూపాల్‌రెడ్డి వారికి హామీ ఇచ్చారు.

తల్లిపాలలో రోగ నిరోధక శక్తి

- డివిజన్ వ్యాప్తంగా తల్లిపాల వారోత్సవాలు
- పలు చోట్ల అవగాహన ర్యాలీలు



కొవ్వూరు మండలం ఐ.పంగిడి తల్లిపాల వారోత్సవాల్లో మాట్లాడుతున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్రీకృష్ణుడు



నల్లజర్ల మండలం కవులూరులో తల్లిపాల ప్రాధాన్యతను తల్లులకు వివరిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి



తాళ్లపూడి మండలం వేగేశ్వరపురంలో తల్లిపాల వారోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

కొవ్వూరు: బిడ్డ పుట్టిన గంటలోగా తల్లి పాలు పట్టించాలని, అమ్మ పాలలో రోగ నిరోధక శక్తి అధికంగా ఉండడం వల్ల బిడ్డలు ఆరోగ్యవంతంగా ఉంటారని గౌరీపట్నం కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఎ. శ్రీకృష్ణుడు పేర్కొన్నారు . ఐ.పంగిడి గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆయన మాట్లాడారు. తల్లి పాల ద్వారా బిడ్డకు న్యుమోనియా, అతిసార వంటి వ్యాధులు సోకవన్నారు. తల్లి పాలు బిడ్డ శారీరక, మానసిక ఎదుగుదలకు ఉపకరిస్తుందన్నారు. పాలు ఇవ్వడం ద్వారా తల్లికి మధుమేహం, రక్తపోటు, స్థూలకాయం వంటి వ్యాధులు వచ్చే అవకాశాలను తగ్గిస్తుందన్నారు. ఏఎన్‌ఎంలు ఎండీ అమీనా, జి.వరలక్ష్మి, టి.సుకుమార్, జి.దివ్య, కె.అఖిల, లలితకుమారి తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడిలో..

తాళ్లపూడి: ప్రభుత్వాసుపత్రుల్లో సుఖ ప్రసవాలతో పాటు ఉచితంగా అన్ని రకాల వైద్య సేవలూ అందిస్తున్నామని తాళ్లపూడి పీహెచ్‌సీ డాక్టర్ హారికాగుప్తా పేర్కొన్నారు. ప్రైవేట్ హాస్పిటళ్లలో రూ.వేలు చెల్లించినా లభ్యం కాని విలువైన వైద్య సేవలను ప్రభుత్వాసుపత్రుల్లో ఉచితంగా అందిస్తున్నట్టు ఆమె వివరించారు. మండలంలోని తాళ్లపూడి, మలకపల్లి సెక్టార్ల పరిధిలో శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేగేశ్వరపురం, మలకపల్లి, పెద్దేవం తదితర గ్రామాల్లో తల్లిపాల ప్రాధాన్యతను వివరిస్తూ అవగాహనా ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమాల్లో హెల్త్ విజిటర్ వేదకుమారి, వైద్య సిబ్బంది శిరీష, గౌతమి, గీతాంజలి, సుజాత, శేషుబాబు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, మలకపల్లి సెక్టార్ సూపర్‌వైజర్ భానుమతి తదితరులు పాల్గొన్నారు.

కవులూరులో..

నల్లజర్ల: ఐసీడీఎస్ నల్లజర్ల సెక్టార్ పరిధిలోని కవులూరు 57వ నంబర్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంట నుంచి ఆరు నెలల వరకూ విధిగా తల్లిపాలు ఇవ్వాలన్నారు. తల్లి పాలలో ఉండే పోషకాలు మరి ఏ ఇతర ఆహారంలోనూ ఉండవని, బిడ్డ ఎదుగుదలకు ఇవి ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. ఈ సందర్భంగా కవులూరు గ్రామంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు కె.మీరాబాయి, ఏఎన్ఎం సీతారత్నం, కార్యకర్త కుసుమకుమారి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే అనంతపల్లిలోని 22వ అంగన్‌వాడీ కేంద్రంలోనూ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించినట్టు సూపర్‌వైజర్ కేవీ కృష్ణవేణి తెలిపారు.

తాడిమళ్ల సెక్టార్ పరిధిలో..

నిడదవోలు రూరల్: పుట్టిన శిశువుకు గంటలోపే తల్లిపాలు తప్పనిసరిగా తాగిస్తే రోగ నిరోధక శక్తి పెరుగుతుందని అంగన్‌వాడీ సెక్టర్ సూపర్‌వైజర్ పి.నళిని అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా తాడిమళ్ల సెక్టర్ పరిధిలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పుట్టిన బిడ్డకు వెంటనే తల్లిపాలు తాగిస్తే శిశు మరణాలు తగ్గుతున్నట్టు అధ్యయనం ద్వారా వెల్లడైందని చెప్పారు. కార్యక్రమాల్లో అంగన్‌వాడీ, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్రిడ్జి సెంటర్‌లో సీసీ కెమెరాల ఏర్పాటు

కడియం: కెనాల్ రోడ్డుపై గల జేగురుపాడు బ్రిడ్జి సెంటర్‌లో సర్పంచ్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ చొరవతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. గ్రామస్తులందరూ ఈ సెంటర్ మీదుగానే ఇతర ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. నిత్యం ఈ రోడ్డు రద్దీగా ఉంటుంది. ఈ నేపథ్యంలో భద్రత కోసం వీటిని ఏర్పాటు చేసినట్లు స్టాలిన్ తెలిపారు. అంతే కాకుండా చోరీలు, ప్రమాదాల సమయంలో నిందితుల ఆచూకీ తెలుసుకునేందుకు తోడ్పడతాయన్నారు.